

# ఆనంద దీపావళి.

శ్రీధర శ్రీరామకృష్ణ

"పద్మజా ఆపరేటెడ్ ఆన్ థర్టీయత్,ఫిమేల్ బేబీ,బోత్ సేపఫ్" సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే చేతికి ఇంటాయనఅందించిన టెలిగ్రావ్ సారాంశమిది. మొదటి సారిగా తండ్రి నయ్యానన్న ఆనందం మనసులో ఉప్పొంగింది. అది నా ముఖంలో ప్రతిఫలించలేదో లేక నేను మగపిల్లాడు పుట్టలేదని నిరుత్సాహ పడుతున్నానని అనుకున్నాడోగానీ ఇంటాయన అన్నాడు 'ఈరోజుల్లో ఆడపిల్లలేనయం నాయనా, ఒక్కమొగుడ్ని కొనిపెడ్తే సరిపోతుంది. అదే మగపిల్లాడనుకో చిన్నప్పట్నుంచి వాడి ఫేషన్లకి ఏది కావాలన్నా కొని పెట్టాలి. ఇంజనీరింగ్‌లోనో, మెడిసిన్‌లోనో సీటు కొనిపెట్టాలి. తర్వాత ఉద్యోగం కొనిపెట్టాలి. ఆనక, వాడు మనల్ని చూడలేదంటేమన ఏడుపు మనం ఏడ్వాలి. అదే ఆడపిల్లయితే నువ్వేది కట్టుకోమంటే అది కట్టుకుంటుంది. నువ్వేది పెడ్తే అది తింటుంది. ముఖ్యంగా పెళ్ళయిం తర్వాత అమ్మ నాన్నలన్న అభిమానంతో నెలకో రెండు నెలలకో ఒకసారి చూట్టానికైనా వస్తుంది' అని.

ఆయన లాజిక్కు బాగున్నట్టే అనిపించింది.

శ్రీమతి పద్మజని మొదటి డెలివరీ అని వాళ్ళ నాన్న వాళ్ళు తీసుకెళ్ళారు. తొమ్మిది నెలలూ నిండ పదిరోజులు దాటినా డెలివరీ అయినట్టు కబురందకపోవటంతో కంగారు అనిపించి అంతకు ముందు రోజే, మధ్యలో వచ్చిన ఆదివారం మరోశలవుతో బాటు, ఈ ఏడాది ఖాతాలో మిగిలిన నాలుగు సి.ఎల్‌లూ కలిపితే ఆరురోజులు కలిసొస్తుందని లెక్కేసి, లీవ్ శాంక్షన్ చేయించుకుని ఆరోజుకి బస్సులో సీటు రిజర్వ్ చేయించుకున్నాను. ఆఫీసునుంచి కాస్త త్వరగా వచ్చా, తయారయి, ఏడింటికల్లా బస్టాండుకు వెళ్ళిపోదామని అనుకుని ఇంటి కొచ్చేసరికి టెలిగ్రామ్ వచ్చి ఉంది. మొత్తానికి ఆరోజునే నేను బస్సు ప్రయాణానికి రిజర్వేషన్ చేయించు కోవటం, టెలిగ్రామూ ఆరోజే రావటం కాకతాళీయంగా కల్సివచ్చాయి.

బస్సులో రాత్రంతా నిద్రపట్టలేదు. ఆలోచనలన్నీ శ్రీమతి చుట్టూ,పాప చుట్టుతానే తిరుగుతున్నాయ్. వాళ్ళిద్దరినీ చూడాలని, ముఖ్యంగా పాప ఎవరిపోలికలో ఉందో చూసుకోవాలని మనసులో ఒకటే ఆతృత. మర్నాడుదయం ఎనిమిదిన్నరకు మామామ గారింటికి చేరుకున్నాను. డైరెక్టుగా హస్పటల్ కే వెళ్ళాలన్నంత ఆతృతగా ఉంది గానీ అది ఎక్కడుందో తెలియక పోవటం మూలంగా ఇంటికెళ్ళక తప్పింది కాదు. క్షణాలలో స్నానం,మిగతా కార్యక్రమాలు ముగించుకుని, ఎడ్రస్ కనుక్కుని రిక్షాలో హస్పటల్‌కు చేరుకున్నాను. పద్మజ బెడ్ పై పడుకుని ఉంది. మనిషి కాస్త నీరసంగాకనిపించింది. పక్కనేపాప. నన్ను చూడగానే పద్మజ చిరునవ్వు నవ్వి మంచం పక్కనున్న కుర్చీ చూపించి కూర్చోమని సైగ చేస్తూ అంది 'పాపవన్నీ మీ పోలికలే' , మంచం మీదకి వంగి చూసాను. అవును. అచ్చం చిన్నదైన నా ప్రతిరూపంలా ఉందిపాప. ఇంకొంచెం మంచం మీదకు వంగి పాపను ముద్దుపెట్టుకుని, తర్వాత శ్రీమతినుదుటి మీద ముద్దు పెట్టుకుని 'థ్యాంక్యు' అన్నాను. తను నా బుగ్గల్ని చేతితో ప్రేమగా స్పృశించింది. భాషకందని మధుర భావన నా గుండెల్లో మెదిలి కళ్ళనుంచి రెండు ఆనంద భాష్పాలు రాలాయి. తన ఆరోగ్యం గురించి కనుక్కుని, మరికాసేపు మిగతావిషయాలు మాట్లాడింతర్వాత అన్నాను 'ఒకసారి మా ఊరు వెళ్ళి అమ్మ నాన్నలకు ఈ విషయం చెప్పి వస్తాను. నాన్నకు ఒంట్లో కూడా బాగోటంలేదు కదా! ఒక సారి చూసినట్టూ ఉంటుంది' 'అలాగే వెళ్ళిరండి. మీరిక్కడ ఉండి, చేసే పని మాత్రం ఏముంది. మా నాన్న, తమ్ముళ్ళూ ఉన్నారుగా అందితను. ఆ రోజుకి అక్కడ ఉండి, మర్నాడుదయమే మా ఊరికి బయలు దేరాను. మా ఊరికి బస్సులు తరచుగా ఉండవు కాబట్టి, మధ్యలో ఒక చోటదిగి అక్కడ్నుంచి మా ఊరి బస్సు దొరికి వెళ్ళేటప్పటికి సాయంత్రం అయింది. మా ఇంట్లో వాళ్ళు మాకు పాపపుట్టిన సంగతి తెల్సి చాలా సంతోషించారు. వాళ్ళతో ఆ రాత్రి, మర్నాడూ గడిపి, మూడోరోజు తిరుగు ప్రయాణమయ్యాను. ఒకసారి మళ్ళీ శ్రీమతినీ, పాపనీ చూసుకుని, అక్కడ్నుంచి నేను పని చేసే చోటికి వెళ్ళిపోవాలని అనుకున్నాను. నేను ప్రయాణమయ్యే రోజే నరక చతుర్దశి. 'రేపొక్క రోజూ ఉండి వెళ్ళకూడదంట్రా అన్నారు అమ్మా నాన్నా. కానీ మర్నాడు పొద్దున్న పద్మజ దగ్గరకు చేరుకుని అక్కడ్నుంచి ఆ సాయంత్రం మళ్ళీ బయలుదేరి,నేను పనిచేసే చోటికి వెళ్ళిపోవాలని చెప్పటంతో వాళ్ళు పెద్దగా బలవంతం చెయ్యలేదు. మధ్యలో సి.ఎల్. అప్లయి చేసి ఉంటంతో లీవు పొడిగించే అవకాశం లేదు. నిజానికి మా ఊళ్ళో, మా కుటుంబ సభ్యులతో దీపావళి పండుగ జరుపుకోవాలని నాకూమనసులో ఉంది. చిన్నప్పుడు టపాసులు కాల్చుకోవాలని ఉత్సాహం ఉన్న వయసులో, కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోక తృప్తిగా కాల్చుకోవటానికి అవకాశం ఉండేది కాదు. కానీ ఇప్పుడు కావల్సినన్ని టపాసులు కొనుక్కోగల స్థోమతా, కాల్చుకోవాలన్న ఉత్సాహం ఉన్నా, పండుగకు ఇంటి దగ్గరుండటానికి టైము దొరకటం లేదు. ఒకపక్క నవ్వొచ్చింది. మరో పక్క కాస్త బాధనిపించింది. ఇంకో రెండు రోజులు సి.ఎల్. ఉన్నా టెలిగ్రామ్ ఇచ్చేసి అక్కడే ఉండిపోయేవాడ్ని.

మర్నాడుదయానికి మామామ గారింటికి చేరుకున్నాను. తొమ్మిది గంటలకల్లా తయారయి ఆసుపత్రికి వెళ్ళి, శ్రీమతినీ, పాపనీ మరోసారి చూసుకుని, కాసేపు తనతో మాట్లాడింతర్వాత ఇంక వెళ్తాను. భోజనం చేసి కాసేపు రెస్టు తీసుకుని సాయంత్రమే వెళ్ళిపోవాలి. లీవు లేదు. నీకు తెల్సుగా!? అన్నాను. నా ఆరోగ్యం గురించి జాగ్రత్తలు చెప్పసాగింది తను. 'నామాట సరే! నువ్వు జాగ్రత్తగా ఉండు. ఆపరేషన్ అయిన మనిషివికూడాను' అని తనకు చెప్పి అక్కడ్నుంచి బయటపడ్డాను. ఇంటికెళ్ళాక భోజనం చేస్తూ, సాయంత్రం బస్సుకి వెళ్ళిపోతానని చేస్తే 'అదేమిటండీ! పండుగరోజు వెళ్ళిపోవటమేమిటి?! మీ బావ మరదులు మీతో కల్సి టపాసులు కాల్చుకోవాలని సరదాపడుతున్నారు. వెళ్ళటానికి వీల్లేదు' అన్నారు మా అత్త,మామలు. కానీ నాకు లీవ్ లేదనీ, మర్నాడు తప్పకుండా ఆఫీసుకు వెళ్ళిపోవాలనీ, పరిస్థితి వివరించి చెప్పటంతో వాళ్ళు కాస్త మెత్తబడ్డారు. మా ఇంటి దగ్గర గానీ అక్కడ గానీ పండుగ జరుపుకోలేక పోయానన్న బాధ నాలోన ఉంది. కానీ ఏం చేయటం? బయలు దేరక తప్పింది కాదు.

బస్సులో పాసింజర్లు చాలా తక్కువ మంది ఉన్నారు. అవునుమరి! ఎవరైనా పండుగపూట వీలైనంతవరకూ ఇంట్లోనే ఉండి, కుటంబ సభ్యులతో సరదాగా గడుపుకోవాలని అనుకుంటారు గాని, ఊరు వెళ్ళాలని అనుకోరుకదా! నాలా ఏ ఆఫీసుకో, అర్జంటు పనిమీదో వెళ్ళాల్సిన బాపతేనేమో ఆ కొద్ది మంది పాసెంజర్లు కూడా.

బస్సు బయలు దేరింది. గంట ప్రయాణం జరిగింది. ప్రతి ఇంటి అరుగుమీదా వెలుగుతున్న ప్రమిదలు దర్శన మిస్తున్నాయి. కొందరు గుమ్మానికి అటొకటి, ఇటొకటి ప్రమిదలు పెట్టి ఊరుకుంటే మరికొందరు గోడల మీద, పిట్ట గోడల మీద, అరుగుల మీద, గూళ్ళలోనూ నూనె ప్రమిదలు, కొవ్వొత్తి ప్రమిదలు వెలిగించి పెట్టారు.

బస్సు ముందుకు వెళ్తూనే ఉంది.

ఇంటి దగ్గరుండి సరదాగా పండుగ జరుపుకోలేకపోయినా, పిల్లలతో



టపాసులు కాల్చుకునే ఆనందాన్ని పంచుకోలేక పోయానే అని నామనసు ఓప్రక్క బాధతో మూలుగుతూనే ఉంది. నెమ్మదినెమ్మదిగా ప్రతీ ఇంట్లోంచి పిల్లలూ, పెద్దలూ బయటకొచ్చి టపాసులు కాల్చటం బస్సులోంచి కన్పిస్తూనేఉంది.

దారి మధ్యలో ఓ రైల్వే గేటు వేసి ఉంటంతో బస్సు అక్కడ కాసేపు ఆగింది. బస్సులోంచి బయటకు చూస్తున్న నాకు ఓ దృశ్యం కనబడింది. ఆ ఇంటికి కొత్తల్లుడనుకుంటాను. సుమారు ఓ ఇరవై రెండేళ్ళ యువకుడు, వెనకే అతని భార్య, మరదళ్ళు నుంచుని ఉన్నారు. అతని చేతిలో చిచ్చుబుడ్డి పట్టుకు కాలుస్తుంటే, అతని భార్య, మరదళ్ళు ఆశ్చర్యంగా చూస్తున్నారు. మరదళ్ళు మతాబులు, కాకర పువ్వొత్తులు కాలుస్తుంటే అతను వాళ్ళతో పరాచికాలాడుతున్నాడు. భార్య టపాసులు కాల్చడానికి భయపడుతుంటే, వెనకాల నుంచుని ధైర్యం చెప్పి మరీ కాల్పిస్తున్నాడతను. అరుగులమీద అతని అత్త మామలు నుంచొని, పిల్లలకు జాగ్రత్తలు చెప్తూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ అల్లుడూ, కోడళ్ళు టపాసులు కాల్చుకోవటాన్ని ఆనందంగా వీక్షిస్తున్నారు.

రైల్వేగేటు తెరవటంతో బస్సు బయలుదేరింది. దారిపొడుగునా రోడ్లు పక్కన పిల్లలూ పెద్దలూ బాణాసంచా కాలుస్తున్నారు. వాళ్ళ మొహాల్లో తాండవిస్తున్న ఆనందం కనబడుతూనే ఉంది.

మరో పది నిముషాల తర్వాత ఓ బ్రిడ్జి దగ్గర ట్రాఫిక్ జామ్ అయి బస్ ఆగిపోయింది. ఆ బ్రిడ్జి కింద చిన్న చిన్న గుడిసెల్లాంటివి నాలుగున్నాయి. వాటిల్లోని జనం దీపావళి పండుగ జరుపుకుంటున్నారు. వాళ్లల్లో పోలియో వచ్చి ఒక కాలు పడిపోయిన ఓ కుర్రాడు కాకరపువ్వొత్తితో చిచ్చుబుడ్డి వెలిగిస్తుంటే ఆ కుర్రాడి తల్లిదండ్రులనుకుంటాను మురిసిపోతూ పక్కవాళ్ళతో ఏదో చెప్పుకుంటున్నారు. ఒక ఎనిమిదేళ్ళ పిల్ల భూచక్రం వెలిగించి పరుగెత్తుకెళ్ళి వాళ్ళమ్మ చంక ఎక్కేసింది. అమె పిల్లకుధైర్యం చెబుతూ, చంకలో పిల్లతో బాటు భూచక్రంతో సమానంగా తిరుగుతోంది. అక్కడ చేరిన మిగతా వాళ్ళంతా నవ్వుతూ, ఆ సన్నివేశాన్ని చూస్తూ నిలబడ్డారు.. ఆ తర్వాత ఒక ఐదేళ్ళ పాప రెండు చేతులతో రెండు కాల్చిన మతాబులిచ్చి, ఆ పాప చేతులు కిందకి వంచేస్తుంటేకాస్తలేపి పైకి పట్టుకుని కాల్పిస్తూ మురిసిపోతుంది మరో జంట. ఓ అరవై ఏళ్ళ ముసలాయన, తనకొడుకు, కోడలూ వద్దనివారిస్తున్నా లెక్కచేయకుండా తారాజువ్వలు అంటించి నేలబారున వదులుతున్నాడు. అవి బ్రిడ్జి పిల్లర్స్‌కి తగిలి పైకి లేచి కింద పడుతుంటే రెట్టింపయిన ఉత్సాహంతో మరిన్ని జువ్వలు వదులుతున్నాడు ఆయన. వెనకాలనుంచున్న మరో కుర్రాడు సిసింద్రీలు నేలలో కూరి చిచ్చుబుడ్లు అంటించినట్టు అంటిస్తున్నాడు. అక్కడ ఉన్నాప్రతి ఒక్కరి ముఖంలోనూ ఆనందం వెల్లి విరుస్తోంది. వెన్న ముద్దలు, కాకరపువ్వొత్తులు, మతాబులు లాంటివి కాలుస్తూ, మధ్య మధ్యలో ప్రమిదలలో నూనె పోసి వత్తులు ఎగదోస్తున్నారు ఆడాళ్ళు

ట్రాఫిక్ క్లియరయినట్టుంది. బస్సుమళ్లీ బయలుదేరింది.

రాత్రి పదకొండు, పన్నెండింటి దాకా దారి పొడుగునా బాణాసంచా కాలుస్తున్న పిల్లలు, పెద్దలు కనబడుతూనే ఉన్నారు. తారాజువ్వలు పోటా పోటీగా వదుల్తూ ఆనందంతో గంతులేస్తున్న యువకులు కనిపించారు. భర్తచాటుననుంచుని భయపడుతూ టపాసులు కాల్చి, అవి పేలగానే భయంతో మొగుడికే దగ్గరగా జరిగి, అతను ధైర్యం చెబ్తున్నట్టు భుజం చుట్టూ చేతులు వేస్తే, అతనికి మరింత దగ్గరగా జరిగి తృప్తిగా నవ్వుకుంటున్న భార్యలు కనిపించారు. తల్లిదండ్రులు ధైర్యం చెబ్తుంటే, ఉత్సాహంగా టపాసులు కాలుస్తున్న పిల్లలు కనిపించారు.. తమ శక్తికి తగ్గట్టు బాణాసంచా కొనుక్కుని కాల్చుకుంటూ, పండుగ ఆనందంగా జరుపుకుంటూ కళ్ళల్లో కాంతులు నింపుకుంటున్నా పేదవాళ్ళు, బిక్షగాళ్ళూ కనిపించారు.

వాళ్ళందర్నీ చూసాక నాకు దీపావళి పండుగ ఇంటి దగ్గరుండి జరుపుకోలేకపోయానే అన్న బాధ ఎగిరిపోయింది. పోదుమరి! అంతమంది కళ్ళల్లోని ఆనంద దీపావళులు నా కంటపడ్డాక. ●

ఒక్కొంటికే వెకుండా క్యాష్ ఇవ్వొచ్చో లేదో మా మేనేజర్ గార్ని అడిగొస్తానండి....




ఇది మరీ అన్యాయం బావా...

